అందుకేనా.. కాలయాపన !

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చట్టాలు.. నిబంధనలను తుంగలో తొక్కుతున్నారు. అయినవారికి ఆకులో.. కాని వారికి కంచంలో అన్న చందంగా అధికారులు వ్యవహరిస్తున్నారు. అందుకు మంగళంలోని న్యూమంగళం పంచాయతీలో ఉన్న మంగళం చెరువు వేలం వేయకపోవడమే ఉదాహరణ. వేలం గడువు ముగిసి ఏడు నెలలు అవుతున్నా ఆ చెరువుకు వేలం నిర్వహించడంలో అధికారులు నిర్లక్ష్యం వీడడం లేదు. దీంతో సందిగ్ధం నెలకొంది.

- గడువు ముగిసి ఏడు నెలలు అవుతున్నా వేలం నిర్వహించని అధికారులు
- కూటమి నాయకులకు కట్టబెట్టేందుకే కాలయాపన
- రూ.లక్షల్లో పంచాయతీ ఆదాయానికి గండి
- జిల్లా పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం
- నేడు అన్న చెరువుకు వేలం


మంగళం చెరువు(ఫైల్)

తిరుపతి మంగళం : పంచాయతీ ఆదాయానికి అధికారులే గండికొడుతున్నారు. మంగళం చేపల వేలం గడువు ముగిసినా గత ఏడు నెలలుగా చేపల వేట మాత్రం ఆగడం లేదు. గత వేలంలో చెరువును దక్కించుకున్న హక్కుదారుడు గంగాధరం పంచాయతీకి ఎటువంటి నగదు చెల్లించకుండా ఇప్పటికీ మంగళం చెరువులో ఇష్టానుసారంగా చేపలను పట్టుకుని విక్రయిస్తున్నాడు. తిరిగి ఆ చెరువులో చేపలు పట్టుకునేందుకు రెన్యువల్ చేయాలని అధికారులకు అర్జీ పెట్టుకున్నాడు. జిల్లా కలెక్టర్ నుంచి ఎటువంటి అనుమతులు రాకపోయినా చెరువులో అతను చేపలు పట్టుకుని విక్రయించుకుంటున్నాడు. దీనిపై పంచాయతీ అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తుండడంతో పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చెరువులో చేపలు పడుతున్న వ్యక్తి నుంచి పంచాయతీ అధికారులకు బాగా ముడుపులు అందుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పంచాయతీ అధికారులు మంగళం చెరువుకు వేలం నిర్వహించకుండా కూటమి నాయకులకు కట్టబెట్టేందుకు పంచాయతీ అధికారులు కాలయాపన చేస్తున్నట్లు కనిపిస్తోంది. అందువల్లే గత ఏడు నెలలుగా వేలం పెట్టకుండా కాలయాపన చేస్తూ ఇప్పుడు నామినల్ ఫీజు కట్టించుకుని గత గుత్తేదారుడికే కట్టబెట్టేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలుస్తోంది. ఇదివరకు మంగళం చెరువును రూ.9.50 లక్షలకు వేలంలో విక్రయించారు. అయితే ఇప్పుడు వేలం నిర్వహిస్తే రెట్టింపు ఆదాయం పంచాయతీకి వచ్చే అవకాశం ఉంది. దీనిపై జిల్లా ఉన్నతాధికారులు కూడా నిర్లక్ష్యం చూపడంతో రూ.లక్షల్లో పంచాయతీ ఆదాయానికి గండిపడుతోంది.

నేడు అన్న చెరువుకు వేలం

మంగళంలోని న్యూ మంగళం పంచాయతీ పరిధిలో నాలుగు చెరువులు ఉన్నాయి. అందులో చింతమాకులగుంట, ఈతమాకుల గుంటలను శ్రీసత్యసాయి మత్స్యకార సొసైటీ వారు నిర్వహిస్తున్నారు. ఇక మంగళం చెరువుకు గత ఏడు నెలలుగా వేలం నిర్వహించకుండా కాలయాపన చేస్తున్నారు. మరొకటి పంచాయతీలోని మిట్టగాంధీపురం వద్ద ఉన్న అన్న చెరువుకు సోమవారం పంచాయతీ అధికారులు వేలం నిర్వహించనున్నారు. పంచాయతీ సచివాలయం వద్ద సోమవారం ఉదయం 10గంటలకు వేలం నిర్వహించనున్నారు. అదే విధంగా మంగళం చెరువుకు కూడా అధికారులు వేలం నిర్వహిస్తారా? లేక పాత వారికే కట్టబెడతారా? అనేది తెలియాల్సి ఉంది. అయితే మంగళం చెరువుకు వేలం నిర్వహించి పంచాయతీకి ఆదాయం చేకూరుస్తారా? లేక అధికార దర్పంతో కూటమి నాయకులకు కట్టబెడతారా? అన్నది రేపటి వరకు వేచిచూద్దాం.

ప్రెస్‌క్లబ్ డైరీని ఆవిష్కరించిన సీఎం


ప్రెస్‌క్లబ్ డైరీని ఆవిష్కరిస్తున్న సీఎం చంద్రబాబు

తిరుపతి సిటీ: తిరుపతి ప్రెస్‌క్లబ్ డైరీ–2025ను ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా ఆవిష్కరింపజేశారు. ఈ మేరకు ఆదివారం తిరుపతి సమీపంలోని ప్రైవేట్ కల్యాణ మండపంలో పెళ్లి వేడుకలకు హాజరైన సీఎం చంద్రబాబు ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు మురళి, బాలచంద్రతో కలిసి డైరీని విడుదల చేశారు. అనంతరం వారు తొలి డైరీని సీఎంకు అందజేశారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌కు స్థలం కేటాయించాలని, అలాగే జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలపై నిర్ణయం తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వినతిపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలిగిరి మురళీమోహన్, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, టీడీపీ సీనియర్ నాయకులు శ్రీధర్ వర్మ, వైస్ ప్రెసిడెంట్ లావణ్య కుమార్, సీనియర్ జర్నలిస్టులు కార్తీక్, రవివర్మ, రాజు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అమ్మవారి సేవలో మధ్యప్రదేశ్ హైకోర్టు జడ్జి


ఆలయం వెలుపల జస్టిస్ వెంకటరమణ

తిరుపతి రూరల్ : తిరుచానూరు శ్రీపద్మావతీ అమ్మవారిని మధ్యప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ వెంకటరమణ ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ మహాద్వారం వద్ద ఆయనకు అధికారులు స్వాగతం పలికి అమ్మవారి దర్శనం చేయించారు. అనంతరం ఆలయ ముఖమండపంలో ఆశీర్వచనం అందించి అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

పర్యావరణ రక్షణే లక్ష్యం


ర్యాలీలో హెచ్‌పీ పెట్రోల్‌బంక్ సంస్థ ప్రతినిధులు

తిరుపతి సిటీ: సంరక్షణ క్షమత మహోత్సవ్ కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం స్థానిక మహతీ ఆడిటోరియం ఎదుట గల హెచ్‌పీ కామ్‌కో మిలీనియం ఫ్రైడ్ పెట్రోల్ సంస్థ ఆధ్వర్యంలో సైక్లోథాన్ పేరుతో సైకిళ్లతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌పీ సంస్థ ఏరియా సేల్స్ మేనేజర్ పి.రెడ్డిప్రసాద్, కోమ్‌కో అధికారి కే.బిలాల్ మాట్లాడుతూ ఇంధన శక్తి పరిరక్షణ, వినియోగాన్ని స్వచ్ఛమైన హరిత శక్తిగా మార్చడంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు కార్యక్రమం చేపట్టామన్నారు. కార్యక్రమంలో పెట్రోల్ బంక్ సిబ్బంది పాల్గొన్నారు.

వేగవంతంగా విశిష్ట సంఖ్య నమోదు

చంద్రగిరి: రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఓ విశిష్ట సంఖ్యను కేటాయించడానికి చేస్తున్న నమోదు ప్రక్రియ వేగవంతంగా నిర్వహిస్తున్నట్లు ఏఓ వియభాస్కర్ అన్నారు. ఆదివారం చంద్రగిరి వ్యవసాయ శాఖ సిబ్బందితో నమోదు ప్రక్రియను చురుగ్గా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చంద్రగిరి మండలాన్ని మూడు క్లస్టర్లుగా విభజించినట్లు చెప్పారు. ఇప్పటివరకు 3,809 మంది ప్రధానమంత్రి కిసాన్ యోజన పథకం కింద ఉన్న రైతులను గుర్తించామని, వారిలో 2,734 మంది వివరాలను నమోదు చేసినట్లు తెలిపారు. మిగిలిన వారిని కూడా గడువు కన్నా ముందే నమోదు చేయనున్నట్లు చెప్పారు.

బీసీ సంఘం జిల్లా అధ్యక్షురాలిగా సావిత్రమ్మ


నియామక పత్రాలు అందజేస్తున్న బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంగళరావు

తిరుపతి కల్చరల్: జాతీయ బీసీ సంక్షేమ సంఘం తిరుపతి జిల్లా మహిళా అధ్యక్షురాలిగా సావిత్రమ్మను ఎంపిక చేసినట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగళరావు తెలిపారు. ఈమేరకు ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన జిల్లా నూతన కమిటీ ప్రతినిధులను ప్రకటించి వారికి నియామక పత్రాలను అందజేశారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శిగా విజయలక్ష్మి, జిల్లా అధ్యక్షుడిగా పూల రాజేష్, ప్రధాన కార్యదర్శిగా రాజేష్ ఆచారిని నియమించినట్లు ఆయన చెప్పారు. జిల్లా నూతన కమిటీ ప్రతినిధులు జిల్లాలోని బీసీ సంక్షేమానికి నిరంతరం కృషి చేయాలని సూచించారు. దేశంలో అత్యధిక జనాభా కలిగిన బీసీల సంక్షేమాన్ని విస్మరించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దగా చేస్తున్నాయన్నారు. బీసీ ప్రధానిగా చెప్పుకునే మోదీ, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం సైతం బీసీలను దగా చేస్తోందన్నారు. బీసీల సంక్షేమమే తమ లక్ష్యం అని చెప్పుకునే ముఖ్యమంత్రి చంద్రబాబు అదే బీసీలను పట్టించుకోకపోవడం దారుణమన్నారు. సమావేశంలో బీసీ యువజన విభాగం నేత శంకర్ యాదవ్ పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమానికి కృషి చేయాలి


మాట్లాడుతున్న సీపీఐ నేత హరినాథరెడ్డి

తిరుపతి కల్చరల్: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం కార్మికుల పోరాటం ఫలితంగానే ప్రత్యేక చట్టం వచ్చిందని, ఈ చట్టం ద్వారా కార్మికుల సంక్షేమానికి కేటాయించిన నిధులను వారికే ఖర్చు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పి.హరినాథరెడ్డి ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మిక సంఘం తిరుపతి జిల్లా ప్రథమ మహాసభ ఎఫ్‌టీయూ భవన్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా భవన నిర్మాణ రంగం లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తోందన్నారు. ప్రభుత్వ బడ్జెట్‌లో 25 శాతం ఆదాయం అసంఘటిత రంగ కార్మికులతోనే వస్తుందన్నారు. ఈ నేపథ్యంలో కార్మికుల హక్కుల పరిరక్షణ, సంక్షేమ బోర్డు చట్టాన్ని కాపాడుకునేందుకు కార్మికులు పెద్దఎత్తున ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.రమణ మాట్లాడుతూ మార్చి 22న చేపట్టే ఛలో ఢిల్లీ కార్యక్రమంలో కార్మికులంతా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ, సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి, ఏపీ ప్రజానాట్య మండలి రాష్ట్ర నేత పెంచలయ్య, కార్మికులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ


సలీం మృతదేహానికి నివాళులు అర్పించిన చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

పాకాల : గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న సలీం(70) శనివారం రాత్రి మృతి చెందారు. సలీం చాలాకాలంగా భారతంమిట్టలోని 4వ క్రాస్‌లో నివాసం ఉంటున్నారు. విషయం తెలుసుకున్న మాజీ తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆదివారం మృతుని నివాసానికి చేరుకుని నివాళులు అర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం మృతుని కుమార్తె చంద్రగిరి మండలం ఐతేపల్లి సర్పంచ్ ఫాజల్, మృతుని కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ ధైర్యంగా ఉండాలని ఎప్పుడు ఏ కష్టం వచ్చినా తోడుగా ఉంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నంగా నరేష్‌రెడ్డి, మునీర్, కపిలేశ్వర్‌రెడ్డి, భాను, భరత్ తదితరులు పాల్గొన్నారు.

పాకాలలో రెచ్చిపోతున్న దొంగలు

పాకాల : మండలకేంద్రంలోని పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్న నాలుగు దుకాణాలు, ఓ పార్టీ ఆఫీసు, ఓ ఇంటిలో దుండగులు చోరీకి యత్నించిన ఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. ఆదివారం స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. స్థానిక పోలీస్‌స్టేషన్‌కు సుమారు 40 అడుగుల్లో దూరంలో ఉన్న ఒక టీ దుకాణంలో, పోలీస్ స్టేషన్ వీధిలోని ఒక టైలరింగ్ షాపులో, ఒక ప్రొవిజన్ షాపులో, బంగారు నగలకు మెరుగులు అద్దే దుకాణంలో, ఓ పార్టీ కార్యాలయం, ఇంటిలో గుర్తు తెలియని దుండగులు తాళాలు పగలగొట్టి చోరీలకు పాల్పడ్డారు. ఆదివారం ఉదయం తాళాలు పగలగొట్టినట్లు గమనించిన దుకాణాల యజమానులు స్థానిక పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు క్లూస్ టీం ద్వారా ఆధారాలను సేకరించారు. దుకాణాల్లో ఎలాంటి దొంగతనం జరగలేదని, పార్టీ కార్యాలయంలో, పైనున్న ఇంటిలో కొన్ని సామాన్లు, పాత సెల్‌ఫోన్లు మూడు చోరీ చేశారని బాధితుడు తెలిపాడు. ఈ మేరకు ఎస్‌ఐ ఎంఎన్ సంజీవరాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలోనే ఇలాంటి చోరీలు జరగడంపై స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. మూడు రోజుల కిందట కూడా ఊట్లవారిపల్లి మెయిన్ రోడ్‌లోని ఓ సరుకుల దుకాణం తాళాలను గుర్తు తెలియని దుండగులు పగలగొట్టినట్లు సమాచారం. పోలీసులు రాత్రివేళ నిరంతరం గస్తీ నిర్వహించేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.


ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం

అపచారం..పాదరక్షలతో సంచారం


శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయం ముందు పాదరక్షలతో సంచరిస్తున్న భక్తులు


పాదరక్షలు ధరించే అమ్మవారి ఆలయం ముందు నిలబడి దండం పెడుతున్న భక్తులు

తిరుపతి రూరల్ : సిరులతల్లి పద్మావతీ అమ్మవారి ఆలయం ముందు అపచారం చోటు చేసుకుంది. భక్తులు యథేచ్ఛగా పాదరక్షలు ధరించి మహాద్వారం ముందు సంచరిస్తున్నారు. టీటీడీ నిబంధనల ప్రకారం అమ్మవారి ఆలయ మహాద్వారం ముందు పాదరక్షలతో సంచరించడం నిషిద్ధం. వేసవి ఆరంభం కావడంతో భానుడి తాకిడికి ఎండలు మండుతున్నాయి. అమ్మవారి ఆలయం ముందు నిలుచుని నమస్కరించాలన్నా ఎండ తీవ్రతకు కాళ్లు మండుతున్నాయి. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు ఆలయం వద్ద భక్తుల రద్దీని చూసి మహాద్వారం వద్దనే అమ్మవారికి దండం పెట్టుకుంటారు. ఎండ తీవ్రతకు ఆలయం ముందు సిమెంటు రోడ్లు కాలిపోతున్నాయి. అపచారమని తెలిసినా భక్తులు కాళ్లకు పాదరక్షలు ధరించి మహాద్వారం ముందు నిలబడి దండం పెట్టుకుంటున్నారు. టీటీడీ అధికారులు ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకుని ఆలయ మహాద్వారం నుంచి వంద అడుగుల దూరం వరకు నీడ కల్పించాల్సిన అవసరం ఉంది.

ఆరోగ్య సంరక్షణలో క్రీడలు ప్రధానం


ప్రసంగిస్తున్న మహిళా వర్సిటీ వీసీ ఉమ

తిరుపతి సిటీ: క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు శరీర, మానసిక ఉల్లాసానికి, ఆరోగ్య సంరక్షణకు ఎంతో దోహదపడతాయని పద్మావతి మహిళా వర్సిటీ వీసీ ప్రొఫెసర్ వి.ఉమ అభిప్రాయపడ్డారు. ఆదివారం ఎస్వీ అగ్రికల్చరల్ కళాశాల వేదికగా ఎస్వీరంగా వర్సిటీ బోధన, బోధనేతర సిబ్బందికి మూడు రోజుల పాటు జరగనున్న క్రీడా, సాంస్కృతిక పోటీలకు ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్సిటీ బోధన, బోధననేతర సిబ్బందికి క్రీడా పోటీలు నిర్వహించడం శుభపరిణామన్నారు. ఉద్యోగులు ఒత్తిడిని జయించి, మానసిక ఉల్లాసాన్ని పొందడానికి క్రీడలు, సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలు వ్యాయామం లాంటివన్నారు. ప్రతి ఉద్యోగి ఏదో ఒక విభాగంలో క్రీడలు ఆడడం దినచర్యలో భాగం చేసుకోవాలన్నారు. వర్సిటీ డీన్ డాక్టర్ కరుణసాగర్ మాట్లాడుతూ శారీర దృఢత్వానికి, సంపూర్ణ ఆరోగ్యానికి క్రీడలు ప్రతి ఉద్యోగికి అవసరమన్నారు. అనంతరం అతిథులను వర్సిటీ అధికారులు జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ ప్రోగ్రాం డైరెక్టర్ మునిరత్నం, ఏడీఆర్ డాక్టర్ సుమతి, కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎంవీ రమణ, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ రవికాంత్ రెడ్డి, వర్సిటీ పరిధిలోని ఐదుజోన్ల నుంచి దాదాపు 200 అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

సృజనకు డాక్టరేట్



తిరుపతి సిటీ: ద్రావిడియన్ వర్సిటీ రసాయన శాస్త్ర పరిశోధక విద్యార్థిని పెనుమూరు సృజనకు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఆమె ప్రొఫెసర్ టి.శోభారాణి పర్యవేక్షణలో 'డెవలప్‌మెంట్ అండ్ వ్యాలిడేషన్ ఆఫ్ హై ఫర్మామెన్స్ లిక్విడ్ డొమెటోగ్రఫీ మెథడ్ ఫర్ ది అనాలసిస్ ఆఫ్ న్యూ ఫార్మాసూటికల్ కాంపౌండ్స్' అనే అంశంపై పరిశోధనా పత్రాలు సమర్పించారు .

వైభవంగా ధ్వజారోహణం


విశేషాలంకరణలో శ్రీ సిద్ధేశ్వరుడు

భాకరాపేట : తలకోన శ్రీ సిద్ధేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాలు వేడుకలు వైభవంగా అంకురార్పణ కార్యక్రమం సాగింది. దక్షిణ కైలాసంగా పేరొందిన శ్రీ తలకోన బ్రహ్మోత్సవాలు ఆదివారం ఉదయం మహా గణపతి, గోపూజ, పుణ్యావచనం అంకురార్పణ, కలశ స్థాపన, రుద్ర పారాయణం, పూర్ణాహుతి కార్యక్రమాలు సాగాయి. సాయంత్రం ప్రదోష కాలంలో నందీశ్వరుడికి అభిషేకం చేశారు. అనంతరం ధ్వజారోహణం అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో చంద్రగిరి ఎమ్మెల్యే నాని, కార్యనిర్వహణాధికారి జయకుమార్, పాలక మండలి సభ్యులు, ఆలయ ప్రధాన అర్చకులు, అధికారులు పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు


నాట్య ప్రదర్శన చేస్తున్న నృత్యకారులు

తిరుపతి రూరల్: తిరుచానూరు శిల్పారామంలో జరిగే వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన 70మంది కళాకారులు తమ ప్రదర్శనలతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. బెంగళూరుకు చెందిన సుష్మ, శ్రేష్ఠ, మధుశ్రీ, ప్రజ్ఞ బృందం ప్రదర్శించిన భరతనాట్యం ఆకట్టుకుంది. అదేవిధంగా చిత్తూరుకు చెందిన వనజాక్షి బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యం ప్రేక్షకులకు కనువిందు చేసింది. బృందకథ, గణేశకౌతవం, అలరింపు, అష్టపది, జాతీశ్వరం, బ్రహ్మాంజలి, తిల్లానా, గరుడగమనం, అన్నమయ్య సంకీర్తనలు వంటి భక్తి పాటలతో పాటు కృష్ణలీలలు నృత్య రూపకాలతో కళాకారులు తమ ప్రతిభను చాటుకున్నారు. బెంగళూరుకు చెందిన కల్పశ్రీ నృత్యాలయం తరఫున ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కల్పశ్రీ నృత్యాలయం సంస్థ ప్రతినిధులతో పాటు నాట్య ప్రదర్శన చేసిన నృత్యకారులను శిల్పారామం పరిపాలన అధికారి ఖాదర్‌వల్లీ సత్కరించారు.

మామిడి అధిక దిగుబడిపై అవగాహన


మాట్లాడుతున్న అధికారులు

చంద్రగిరి: మామిడి చెట్లకు సరైన పద్ధతిలో పోషకాహార నిర్వహణతో అధిక మామిడి పండ్ల దిగుబడి పొందవచ్చని చంద్రగిరి ఉద్యాన అధికారి శైలజ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని నారావారిపల్లి టీటీడీ కల్యాణ మండపంలో కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఆధ్వర్యంలో మామిడి రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మామిడి తోటల్లో నిర్వహణ పద్ధతుల గురించి తెలిపారు. మెరుగైన మామిడి దిగుబడి కోసం పోషకాహార నిర్వహణపై రైతులకు అవగాహన కల్పించారు. కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ జోనల్ మేనేజర్ రమణ రెడ్డి మాట్లాడుతూ కోరమండల్ సంస్థ మార్కెట్ వాటా, ఉత్పత్తుల గురించి వివరంగా వివరించారు. సీనియర్ వ్యవసాయ శాస్త్రవేత్త నర్సిరెడ్డి ప్రసంగిస్తూ మామిడి పంటలో సమగ్ర పోషక నిర్వహణపై రైతులకు వివరించారు. మంచి దిగుబడి కోసం నానో డీఏపీ వాడాల్సిన మోతాదు తద్వారా కలిగే ప్రయోజనాల గురించి తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్త అనిల్ కుమార్ రెడ్డి, చంద్రగిరి, నారావారిపల్లి, భీమవరం తదితర ప్రాంతాలకు చెందిన మామిడి రైతులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

క్రికెట్‌లో విద్యార్థినుల ప్రతిభ


చాంపియన్ ట్రోఫీలతో విద్యార్థినులు

తిరుపతి సిటీ: ఆంధ్రప్రదేశ్ టెన్నిస్‌బాల్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 21వ తేదీ నుంచి ఆదివారం వరకు మూడు రోజుల పాటు జరిగిన 12వ సీనియర్ స్టేట్‌లెవల్ టెన్నీస్ బాల్ క్రికెట్ చాంపియన్‌షిప్ ఉమెన్స్ విభాగంలో తిరుపతి జిల్లా బాలికల జట్టు 3వ స్థానంలో నిలిచింది. ఇందులో పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం విద్యార్థులు పాల్గొని ప్రతిభ చాటారు. ఈ సందర్భంగా వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజిని, అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు.

మిన్నంటిన సంబరాలు

తిరుపతి క్రైం: పాకిస్తాన్‌పై భారత జట్టు ఘన విజయం సాధించడంతో తిరుపతిలో బీజేపీ జిల్లా సాంస్కృతిక విభాగం కన్వీనర్ గుండాల గోపీనాథ్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి సంబరాలు జరుపుకున్నారు. ఇందులో బీజేపీ సెంట్రల్ మండల అధ్యక్షుడు దీపక్ యాదవ్, మండల ఉపాధ్యక్షుడు తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, నాయకులు స్వీట్లు పంచి పెట్టి.. మేరా భారత్ మహాన్ అని నినదించారు.


సంబరాలు జరుపుకుంటున్న బీజేపీ నేతలు

'శేషాచల కొండకోనల్లో' పుస్తకావిష్కరణ


శేషాచల కొండకోనల్లో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న పలువురు వక్తలు, రచయితలు

తిరుపతి కల్చరల్: ట్రెక్కింగ్ అభిలాషకులకు చక్కటి మార్గదర్శి «శేషాచల కొండకోనల్లో» పుస్తకమని సీనియర్ జర్నలిస్టు, మ్యాక్ సంస్థ వ్యవస్థాపకుడు బీవీ రమణ కొనియాడారు. ఆదివారం కపిలతీర్థం సమీపంలోని నగర వనంలో పలువురు వక్తలు శేషాచల కొండకోనల్లో పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రచయిత, అభ్యుదయవేత్త భూమన్ తన పాతికేళ్ల ప్రకృతి ట్రెక్కింగ్ మథనం నుంచి ఉద్భవించిన యాత్రా రచనా సంకలనమైన «శేషాచల కొండకోనల్లో» పుస్తకమని తెలిపారు. తూర్పు కనుమల్లో భాగమైన తిరుమల, ఇతర శేషాచల అరణ్య సౌందర్యాన్ని తాను చేసిన ట్రెక్కింగ్ కార్యక్రమాలను 60కి పైగా శీర్షిక కింద రచయిత భూమన్ వర్గీకరించి రమ్యమైన ఛాయాచిత్రాలతో పుస్తకరూపంగా అందించారని తెలిపారు. అనంతరం పుస్తక రచయిత భూమన్ మాట్లాడుతూ 75 ఏళ్ల వయసులో ఇప్పటికీ కొండకోనల్లో, అడవులు, జలపాతాల్లో విహారం చేయడానికి ట్రెక్కింగ్ కారణమన్నారు. ఈ సందర్భంగా భూమన్‌ను శ్రీసిటీ పీఆర్‌ఓ, సీనియర్ జర్నలిస్టు రామచంద్రారెడ్డి, పలువురు పుస్తక ప్రియులు సత్కరించి అభినందించారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

తిరుపతి తుడా: నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక సోమవారం నిర్వహించనున్నట్లు కమిషనర్ మౌర్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 9.30 గంటల నుంచి 10.30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం, అదేవిధంగా అర్జీలు, ఫిర్యాదులు ఇచ్చే వారి కోసం ఉదయం 10.30 గంటల నుంచి 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' కార్యక్రమం జరుగుతుందన్నారు. అలాగే 0877–2227208 నంబరుకు కాల్ చేసి సమస్యలు చెప్పవచ్చన్నారు.